# ప్రవాసాంధ్రులకు అవకాశాలు

## అమరావతి- అమెరికా వైద్య సంస్థ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు



**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రపంచంలో ఉండే తెలుగువారంతా ఇక్కడికే వచ్చి పని చేసేలా అమరావతిలో అవకాశాలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నారైలకు హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నంలో ప్రవాసాంధ్రులు నిర్మించనున్న అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( ఎఎఐఎంఎస్ ) సంస్థ కు గురువారం విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్ నుంచి సిఎం మీట నొక్కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎఐఎంఎస్ ప్రపంచ స్థాయి ఆస్పత్రిగా రూపొందాలన్నారు. భవిష్యత్తులో అధునాతన, అత్యవసర వైద్యానికి, అన్ని రకాల క్లిష్ట చికిత్సలకు అమెరికా నుంచే రోగులు ఇక్కడకు వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ సంస్థ నిర్మాణం కోసం 20 ఎకరాల భూమి దానం చేసిన ఇబ్రహీంపట్నం మాజీ సర్పంచ్ మల్లెల పద్మనాభరావును సిఎం కొనియాడారు. అమెరికాలో సంపాదించిన విజ్ఞానాన్ని, కష్టార్జితంతో ఇక్కడ ప్రముఖ ఆస్పత్రి నెలకొల్పేందుకు పూనుకున్నారని పేర్కొంటూ ఎఎఐఎంఎస్ ఛైర్మన్ నవనీత కృష్ణను, ఇతర భాగస్వాములను ముఖ్యమంత్రి కొనియాడారు. అమరావతిలో 21 ప్రముఖ సంస్థలు నెలకొంటున్నాయని తెలిపారు. రూ 600 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎఎఐఎంఎస్ లో 1200 పడకలతో పూర్తి చేస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు. అందులో భాగంగా 2019 నాటికి మొదటి దశలో 300 పడకలతో కూడిన ఆస్పత్రిని పూర్తిచేసే లక్ష్యంతో పూర్తి చేస్తామన్నారు. రెండో దశలో మరో 500, మూడో దశలో 400 పడకలతో ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

### 50 శాతం మందికి ప్రభుత్వ వైద్యం : కామినేని

రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా 50 శాతం మందికి వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఈ సంస్థ కోసం భూమి దానం చేసిన మల్లెల పద్మనాభరావును కొనియాడారు. మంత్రి అఖిలప్రియ మాట్లాడుతూ సిఎం స్ఫూర్తితో అరకులో హిమాలయ మెడికల్ టూరిజం ఏర్పాటుకు చొరవ చూపిస్తున్నామని చెప్పారు. ఎఎఐఎంఎస్ ఛైర్మన్ నవనీత కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సిఎం ఆకాంక్షలకు అనుగుణంగా ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.